# నగదు లావాదేవీలపై దృష్టి సారించాలి



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

**బ్యాంకర్లకు నిజామాబాద్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు సూచన**

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 19 : సాధారణ ఎన్నికల నేపథ్యంలో నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టిని సారించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు బ్యాంకర్లకు సూచించారు. కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. రూ. 10 లక్షలు, అంతకన్నా ఎక్కువ మొత్తంలో నగదు డిపాజిట్, విత్‌డ్రా జరిపేవారి వివరాలను ఎన్నికల వ్యయపరిశీలకుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అసాధారణ, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలని, వ్యవసాయ పనులు, వ్యాపార అవసరాలకు నగదు లావాదేవీలు జరిపే వారికి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో విస్తృత తనిఖీలు చేపడుతున్నందున బ్యాంకుకు సంబంధించిన నగదు తరలిస్తున్న సమయంలో అన్ని నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ. 40 లక్షలకు మించకూడదని తెలిపారు. అభ్యర్థులు ఒకే బ్యాంకు ఖాతాద్వారా లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని, బ్యాంకు ఖాతాకోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సత్వరమే చెక్‌బుక్, డెబిట్ కార్డు తదితర వాటిని సమకుర్చాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## సిలిండర్ పేలి రేకులషెడ్డు దగ్ధం



సిలిండర్ పేలడంతో కాలిపోయిన రేకుల షెడ్డు

మాక్లూర్, అక్టోబర్ 19 : మండలంలోని కొత్తపల్లిలో కుంటి మల్లేశ్ రేకులషెడ్డు బుధవారం రాత్రి సిలిండర్ పేలి దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేశ్ గ్రామంలోని రేకుల షెడ్డులో సైకిల్‌షాపు నిర్వహిస్తున్నాడు. నూతనంగా ఇంటి నిర్మాణం చేపడుతుండడంతో ఇంటికి సంబంధించిన సామగ్రితో పాటు నిత్యావసర సరుకులు, రూ.2లక్షల నగదును రేకుల షెడ్డులో ఉంచాడు. సిలిండర్ పేలడంతో సరుకులు, నగదు కాలిపోయాయి. రెవెన్యూ, పోలీస్, అధికారులకు సమాచారం అందజేసినట్లు బాధితుడు తెలిపారు.

# బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి గులాబీ కండువా కప్పుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్

కామారెడ్డి, అక్టోబర్ 19 : బీఆర్‌ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. తాజీగా కామారెడ్డిలోని 23వ వార్డులో 50 మంది మైనార్టీలు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో గురువారం చేరారు. వారికి ముజీబుద్దీన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించడానికి కామారెడ్డిలోని చాలా మైనార్టీలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, తేజపు ప్రసాద్, అంజద్, పాషా, హైమద్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

**కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

మద్నూర్, అక్టోబర్ 19 : ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఈవీఎంలు భద్రపరిచే గది, సలాబత్‌పూర్ వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును ఆయన గురువారం పరిశీలించారు. గదులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గదులకు సెక్యూరిటీ, చుట్టూ మార్కింగ్ చేయడం, చుట్టుపక్కల రోడ్లు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెక్‌పోస్టు వద్ద మద్యం, డబ్బు కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో నామినేషన్లకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ మను చౌదరి, బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి, తహసీల్దార్ ముజీబ్, సీఐ కృష్ణ. ఎస్సై కృష్ణారెడ్డి, నాయబ్ తహసీల్దార్ భరత్, గిర్దావర్ శంకర్, సీనియర్ అసిస్టెంట్ విజయ్ తదితరులు ఉన్నారు.



చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన



ఎల్లారెడ్డి జీవదాన్ పాఠశాలలో అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 19: ఎల్లారెడ్డి పట్టణంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఎస్పీ సింధుశర్మతో కలిసి గురువారం పరిశీలించారు. పట్టణంలోని జీవదాన్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన సెంటర్‌ను పరిశీలించిన వారు.. ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరచడానికి అక్కడ ఉన్న ఐదు స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. గదుల కిటికీలు, వెంటిలేటర్లను పూర్తిగా మూసివేయాలని సూచించారు. ఎన్నికల నిర్వాహణ తదితర అంశాలపై ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ సురేశ్‌కు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం తీసుకోవాల్సిన భద్రత చర్యలపై చర్చించారు. వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట ఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ సంగమేశ్వర్, గిర్దావర్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీ

**పలు ప్రాంతాల్లో రూ. 10.54 లక్షలు స్వాధీనం**



కామారెడ్డి పట్టణంలో నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

బాన్సువాడ రూరల్/ కామారెడ్డి/ భిక్కనూరు/ శక్కర్‌నగర్, అక్టోబర్ 19 : ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, ఇతర వస్తువులను అక్రమంగా తరలించకుండా పోలీసులు, అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. గురువారం పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 10.54 లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామం వద్ద డీఎస్పీ జగన్నాథం ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. దేవీసింగ్ అనే వ్యక్తి వద్ద రూ. 70,500, జోగిపేట్ సిద్ధప్ప నుంచి రూ. 1.50 లక్షలు, బిలాల్ నుంచి రూ.70 వేలు మొత్తం రూ. 2.95 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి అందజేశారు. సీఐ మహేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డిలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో పట్టణ ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో గురువారం తనిఖీ చేపట్టారు. ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో 1,17,240 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎన్నికలు అయ్యేంత వరకు ఇతర అవసరాలకు డబ్బులు తీసుకెళ్లే వారు రసీదులను తప్పకుండా వెంట ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీ చేపట్టారు. ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న వారి నుంచి మొత్తం 2 లక్షల 42 వేల 500 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.

బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ఓ వ్యక్తి నుంచి రూ.4 లక్షలు స్వాధీనం చేసుకొని, సీజ్ చేసినట్లు పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన విశ్రామ్ హరాజీ భానుశాలి వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు లభ్యం కాగా.. సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.



బాన్సువాడ మండలం తాడ్కోల్ వద్ద డబ్బును స్వాధీనం చేసుకుంటున్న డీఎస్పీ జగన్నాథం, సీఐ మహేందర్‌రెడ్డి

## జైతాపూర్‌లో చైన్‌స్నాచింగ్

- **మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసు చోరీ**

ఎడపల్లి, అక్టోబర్ 19 : బైక్ వచ్చిన వ్యక్తి ఓ మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామానికి చెందిన శారద.. మరో మహిళతో కలిసి గురువారం తన బంధువుల ఇంటికి వెళ్తున్నది. గుర్తుతెలియని వ్యక్తి మోటరు సైకిల్‌పై వచ్చి అడ్రస్ అడుగుతూ శారద మెడలోని మూడు తులాల పుస్తెలతాడును తెంపుకొని పరారయ్యాడు. అక్కడే ఉన్న వెంకట్‌రావు అనే వ్యక్తి వెంటనే డయల్ 100 ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్, ఎస్సై విక్రం ఘటనాస్థలానికి చేరుకొని బాధితురాలితో మాట్లాడారు. వివరాలను నమోదు చేసుకున్నారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి, త్వరలోనే కేసును ఛేదిస్తామని తెలిపారు.



బాధితురాలితో మాట్లాడి వివరాలను తెలుసుకుంటున్న ఏసీపీ కిరణ్ కుమార్